# దూరం

## శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

**జీ**వితం మాస్టారి లాటిది.

సంఘటనలు – పాఠాలే.

ఒక్కొక్క అనుభవమూ నీతినో, నిజాన్నో గ్రహింపుకు తెస్తుంది. సునిశితమయిన మనిషయితే అనుభవాల ఆస్తితో జీవితాన్ని సుసంపన్నం చేసుకోగలడు.

ఒక్కొక్క సంఘటన మరీను !

మనిషిని కదిలించి – అతని అహాన్నీ అజ్ఞానాన్నీ కుదిపి వదులుతుంది.

... ... ...

కుషన్ సీటుమీద కులాసాగా కూర్చుని – విలాసంగా తలను వెనుక కాన్చి కారు వేగాన్ని ఆనందంగా అనుభవిస్తూ – జరపబోయే కార్యక్రమానికి మెదడులో రిహార్సల్ వేసుకుంటున్నాడు ప్రభాకరం—లెక్చరర్.

అతను – వెనుక సీటులో కూర్చుంటే –

కారు నడుపుతున్నాడు శేఖరం—ఓ పబ్లిక్ కన్సర్న్‌లో ఆఫీసరు.

కారు – స్లో ఔతూ – ఆగింది.

కళ్లు చిట్లింటి చూశాడు ప్రభాకరం. శేఖరం—కారు దిగి...

ఆశ్చర్యపోయాడు ప్రభాకరం. శేఖరం పొరపాటు పడలేదు కద ? హటాత్తుగా మతి భ్రమించలేదుకద ?

శేఖరం – ఆ మాసిన బట్టల మనిషికి నమస్కరించాడు కుశల ప్రశ్నలు వేశాడు. అంతటితో ఆగలేదు. ఆతని చేయి పట్టుకుని ఎంతో ఆదరంగా గౌరవంగా – స్వయంగా కారెక్కించి – పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

కారు కదిలింది.

ప్రభాకరానికి మెదడు పనిచేయడం మానేసింది.

శేఖరం ఆషామాషీ ఆఫీసరు కాదు. అంత గొప్పవాడి దగ్గర పనివాడిగా ఉండేందుకు కూడా అర్హత లేదీ మాసిపోయిన మనిషికి. అటువంటి వాణ్ణి శేఖరం కారే కాకుండా నెత్తికూడా ఎక్కించుకుంటున్నాడు !

"సుశీలకు పెళ్లి చేశారా మాస్టారూ ?"

"చేశాను బాబూ..."

"అల్లుడేం చేస్తున్నాడు ?"

"ఎలిమెంటరీ స్కూలు టీచరు..."

"ప్రసాదేం చేస్తున్నాడు ?"

"వాడిదే సమస్యగా ఉండిపోయింది నాయనా ! బి. కామ్. పాసై రెండేళ్లయింది. ఇంతవరకూ ఉద్యోగం లేదు. ఏదో – వాడి కాళ్లమీద వాడు నిలబడగలిగితే అదే పదివేలు. రేపిక్కడ ఏదో ఇంటర్వ్యూ ఉందంటే వాడితోపాటు నేనూ వచ్చాను. బాబూ ! నువ్వేం చేస్తున్నావ్ ?"

"అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా అపాయింట్ అయ్యాను. రెండు వేల పైచిలుకే అందుతుంది నెలకి..."

"చాలా సంతోషం నాయనా ! వృద్ధిలోకి వచ్చావు. ఇప్పుడు నాకు చాలా ఆనందంగా ఉంది...మా అబ్బాయే గొప్పవాడైనంత..." ఆనందం ఆపుకోలేక – తడబడ్డాడు.

"ప్రసాదుకి ఉద్యోగం యిప్పించే పూచీ నాది. మీరు నిశ్చింతగా ఉండండి. రేపు జరగబోయే ఇంటర్వ్యూకి సెలక్టింగ్ ఆఫీసర్‌ని నేనే !–"

ఈ సంభాషణ వింటున్న ప్రభాకరం గుండెల్లో బండరాయే పడింది. ఐతే– మరుక్షణం అతను తేరుకున్నాడు. ఇంతాచేస్తే యితను బడిపంతులన్నమాట ! వాటమూ అదీ చెబుతూనే ఉంది. ఈ మాస్టరు – శేఖరానికి అ ఆ లో, ఇ ఈ లో చెప్పి ఉంటాడు. అఆ ఇఈలకే అంత విలువైతే తను చెప్పిన పర్‌ఫెక్ట్ కాంపిటీషన్, మానోపలీల విలువెంత ? మాస్టర్ని కారెక్కించుకుంటే – లెక్చరర్ నెక్కడెక్కించుకోవాలి ? అఆ ఇఈలు దిద్దించిన ఒకటో తరగతి మాస్టర్నే మరచిపోలేని శేఖరం – ఐదేళ్ల కిందట డిగ్రీ క్లాసులు తీసుకున్న తననెంత గుర్తుపెట్టుకుంటాడు ?

ఊహలలో తేలిపోతున్నాడు ప్రభాకరం.

తనంటే అమిత గౌరవం కనుకనే హాయిగా హుందాగా వెనక సీటు ఏర్పాటు చేశాడు – శేఖరం. అతనికి నిశ్చయంగా తెలుసు ఎవరి నెంత గౌరవించాలో. బడి పంతుల్నీ, లెక్చరర్నీ ఒక్కచోటే కూర్చోపెడితే – గాడిదనీ గుర్రాన్నీ ఒకేకొయ్యకి కట్టేసినట్లుండదూ? అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కనుకనే శేఖరం అనుగుణంగా ప్రవర్తించాడు. ఇప్పుడు—మాస్టరుకి చేసిన వాగ్దానం మాత్రం? ఏదో యాథాలాపంగా అన్నమాటే తప్ప నిజంగా ఉద్యోగం యిస్తాడా ఏం ? మాట వరసకని ఉంటాడంతే. ఆఫీసర్లది అదో టెక్నిక్. సాధారణంగా

మాటలలో ఎవరినీ నొప్పించరు. క్రియ విషయం వచ్చేసరికి—ఉండనే ఉంది బ్రహ్మాస్త్రం – సారీ!

ముసిలాయన శేఖరం మాటలు నిజమే అనుకొని పొంగిపోతున్నట్లుంది – పూర్ ఫెలో!

నవ్వుకున్నాడు ప్రభాకరం.

ఒక్కసారి జిప్‌బ్యాగ్ తడిమి చూశాడు.

బ్యాగ్‌లో బ్లాక్ డాగ్ సురక్షితంగానే ఉంది. హోటల్లో డిన్నరు సిద్ధంగా ఉంటుంది. ఇంక ఉద్యోగం రాకేంచేస్తుంది తన తమ్ముడికి ? మరొక విషయం. తను మాస్టారిలా బయటపడిపోలేదు. అంతా చాలా డిప్లొమాటిక్‌గా ఏర్పాటు చేశాడు. డిన్నర్ కలసి తీసుకుందుకు శేఖరాన్ని అంగీకరింప జేశాడు. సమయమూ సందర్భమూ చూసి తప్ప మనసులో మాట బయటపెట్టడు. అదీ – ఏ మూడో రౌండులోనో! అటువంటప్పుడు లేదనగలిగే శక్తి ఎవరికుంటుంది ?

కారు—శేఖరం యింటిముం దాగింది.

"మీరు – డ్రాయింగ్ రూంలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటూండండి" అని ప్రభాకరానికి చెప్పి – .మాస్టార్ని లోపలకి తీసుకు వెళ్లాడు శేఖరం.

అరగంట తరవాత – ఒక్కడే వచ్చాడు. స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు. డిన్నర్ డ్రెస్. మళ్లీ పక్క గదిలోకి వెళ్లాడు.

"నన్ను క్షమించాలి మాస్టారూ! వారు మా లెక్చరర్. ఈ రాత్రి ఆయన ఆతిథ్యం స్వీకరిస్తానని వాగ్దానం చేశాను. అందుచేత మీతో కలసి భోజనం చేసే అదృష్టం రేపటి వరకూ వాయిదాపడింది. అరగంటలో వచ్చేస్తాను. ఈలోగా ప్రసాద్‌ని తీసుకువస్తాడు డ్రయివర్. క్షమిస్తారు కదూ!"

"ఎంతమాట! వెళ్లిరా బాబూ."

ప్రభాకరం నవ్వుకున్నాడు. అరగంట కాదు. ఆరు గంటలు. బ్లాక్ డాగ్ అంటే తమాషాలు కాదు. అది సేవించాక మాస్టారూ గుర్తుండడు, మనిషీ గుర్తుండడు. అంత మత్తూ మైకమూ. ప్రభాకరం – శేఖరంతో కలిసి కారెక్కాడు. కారెక్కాక – బ్యాగ్ ఉందో లేదో మళ్లీ జాగ్రత్తగా చూసుకున్నాడు. ఔను. అది—విదేశీ సరుకు. చాలా శ్రమపడి—ఎక్కువ డబ్బుపెడితే తప్ప దొరకలేదు.

రిజర్వు చేయబడిన రూములోకి తీసుకువెళ్లాడు శేఖరాన్ని. ఖరీదయిన హోటల్‌లో – కళ ఉట్టిపడుతూందా గది. కాలికి గిలిగింతలు పెట్టే కార్పెట్. కిటికీ దగ్గర చక్కని టేబులు. దానిమీద తళతళలాడుతున్న ప్లేట్లలో ఆహారపదార్థాలు. రంగురంగుల గ్లాసులు పానీయాలతో రంజిల్లాలని ఎదురుచూస్తున్నాయి. ఒక్క మాటలో ఆ గదీ పరిసరాల్లూ అట్టహాసంగా ఉన్నాయి. బ్లాక్ డాగ్ నోరు తెరచి





ెలు ఎలో మొట్టమొదటి అరడజన్
పుస్తకాలు అచ్చయింది ఆంధ్రదేశంలో కాదు,
భారతదేశంలోనూ కాదు, జర్మనీలోని హాలే
పట్టణంలో, 1946–7 సంవత్సరంలో!
నాటినుంచి నెమ్మదిగా
తెలుగు ముద్రణలు పుంజుకున్న తీరుతెన్నులు–
నిఘంటువులు, వ్యాకరణాలు, తదితర గ్రంథాలు
పుంఖానుపుంఖాలుగా అవతరించిన
కథా కమామీషులు–
తెలుగు సారస్వతపు పునరుజ్జీవన
వికాసాన్నీ చారిత్రక పరిణామాన్ని
ఆమూలాగ్రంగా సచిత్రకంగా
అనర్ఘంగా వివరించే ఆంగ్లగ్రంథం.

*రచన: డాక్టర్ జె మంగమ్మ*

**ప్రచురణ: బంగోరె.**

340 పేజీలు, 28 ఫోటోలు.

వెల మేలుప్రతి 75 రు. సాదాప్రతి 60 రు

ప్రతులకు :——

బంగోరె,
సీనియర్ రీసర్చి ఆఫీసర్,
సి. పి. బ్రౌన్ ప్రాజెక్టు,
తెలుగు డిపార్ట్‌మెంట్, ఎస్. వి. యూనివర్సిటీ,
తిరుపతి. 517502.

సీసాలోంచి గ్లాసులలోకి ఉరికింది. బసు — ఆనందంతో కరిగి పోతోంది.

"ఛీర్స్—" అన్నాడు ప్రభాకరం- నవ్వుతూ.

"ఒక్క మాట—"

"ఏమిటి ?"

"ఈ పార్టీ మీరెందుకు ఏర్పాటు చేసినట్లు ?" అడిగాడు శేఖరం.

త్రుళ్లిపడ్డాడు ప్రభాకరం. అంతలోనే సర్దుకుని—"ఏమీలేదు, ఊ కినే..." అన్నాడు.

"చెప్పండి—" మళ్లీ అడిగాడు శేఖరం – సూటిగా చూస్తూ.

గదిలో ఓమూల – అంతవరకూ కనిపించకుండా కూర్చున్న గోవిందరావ్—ప్రభాకరం తమ్ముడు భయపడ్డాడు.

ప్రభాకరం నోరు విప్పలేకపోయాడు.

ఈసారి శేఖరం నవ్వాడు. "క్షమించండి. ఇదంతా చాలా వ్యర్థం—" ప్రభాకరం మౌనం దాల్చాడు. తన ప్రణాళిక యిలా తారుమారు అయిందేమిటి ? బ్లాక్ డాగ్ ... తందూరీ చికెన్ .., ఇవేవీ శేఖరాన్ని ప్రలోభపెట్టలేకపోతే...

"రేపటి ఉద్యోగం కోసమేఐతే...సారీ...నేనేమీ చెయ్యలేను."

"శేఖరం !—"

"మీరు మీ మనసులో మాట ముందే చెబితే...యీ అనవసర ప్రయాసా, ఖర్చూ ఉండేవి కావు—"

"అంటే ?" తెల్లబోతూ అడిగాడు ప్రభాకరం.

"మీ క్యాండిడేట్‌కి నేను ఉద్యోగం యివ్వలేను—"

"ఎందుకని ?"

"నిజంగా మీకు తెలియదూ ? మీముందేకదా నేను వాగ్దానం చేశాను మా మాస్టారికి ?"

"నేనూ నీ మాస్టారినే!" నవ్వబోయాడు ప్రభాకరం.

"కాదు—" కచ్చితమైన స్వరంతో అన్నాడు శేఖరం— "మీరు- లెక్చరర్ !"

"లెక్చరర్- మాస్టారికంటే ఎక్కువేకదా ?"

"ఎలా ?"

"ఆయన నీకు అఆలు చెబితే— నేను అంతకంటె పెద్ద విషయాలే చెప్పానుకదా ?"

"ఔను. కాని— అఆలే లేకపోతే ?" ఎదురు ప్రశ్న వేశాడు శేఖరం.

ప్రభాకరం తెల్లమొహం వేశాడు.

"మాస్టారు నా విద్యకి పునాదులు వేస్తే — మీరు అంతస్తులు కట్టారు. మాస్టారు చెప్పినవి పాఠాలు. మీవి లెక్చర్స్. ఆయన పాఠాలు మనసుకి పట్టేవి. మీ లెక్చర్స్— చెవులలో..."

"అంటే...నా లెక్చర్స్...?"

"ఉహూం. నా ఉద్దేశం అది కాదు. కాని—ఒక్కతేడాచూడండి. ఆయన నేనెవరినో నా హోదా ఏమిటో తెలుసుకోకుండానే సహజమైన ధోరణిలో ఆప్యాయతా వాత్సల్యమూ కురిపించారు. మీరు— నామీద పెద్ద ప్రణాళిక వెయ్యబోయారు. తేడా లేదూ ?"

అతనేమీ అనలేకపోయాడు.

"నిజానికి మీరు చనువు తీసుకుని సూటిగా వ్యవహారం గురించి అడిగితే నేను చాలా సంతోషించేవాడిని. ప్రయత్నించేవాడిని. కాని— మీరు మీ ప్రవర్తనతో నన్ను చాలా దూరంచేసి..."

ప్రభాకరం పశ్చాత్తాప పడుతున్నాడు.

"బెటర్ లక్ నెక్స్ట్ టైమ్." గదిలోంచి నడుస్తున్న శేఖరాన్ని వారించడానికయినా నైతిక బలం చాలలేదు ప్రభాకరానికి. అ ఆ ఇ ఈ లు చెబుతున్న మాస్టారే కళ్లముందు మెదులుతూంటే భరించలేనట్లు గ్లాసు గొంతులో వొంపుకున్నాడు.

